# మార్పు

పి. రాజారావు

రేపటి లెక్చరు తయారుచేసుకోవాలని టేబిల్ దగ్గర కూర్చున్నాడు ఆమోసు భోంచేయడముతోనే. ఇంతలో భార్య మాణిక్యము తాంబూలముయిచ్చి మళ్ళా వంటింట్లోకి వెళ్లింది. పిల్లల స్వదేశ ఆందోళన యెక్కువైంది ఆయన పనిచేయు కళాశాల్లో, వీటిని అణచుటకు సాధనమేమా అను ఆలోచంతో అరికట్టబడ్డాడు. తాను పాఠాలు సిద్ధపర్చి తెచ్చిన పుస్తకం తెరిచినట్లేవుంచి, ప్రింసుపాలూ, యితర పెద్దలకంటే గూడ కాలేజీలో సమస్తము తనభారముతో నడచేట్టుందని, తన తలంపు. ఈ విషయము అందరు ప్రొఫెసర్లు పట్టుబట్టిన వుద్యమమును హతమార్చవచ్చని అతని తహతహం. ఆయన తన ఆలోచనాప్రవాహాన్ని అరికట్టి రేపటి తన కర్తవ్యము గట్టెక్కించుకోవాలని, బల్లమీద పేనా నందుకొబోయాడు. బల్లమీద ఒక దానికెదురుగా యింకోటి నిలబెట్టబడియున్న గాంధీ—ఏసుక్రీస్తు పఠాలపై దృష్టిపడింది. అనుకోనట్టు అతనికి, భార్య మాణిక్యము జ్ఞాపకమువచ్చింది. ఒకమాట్టు వెనక్కు తిరిగిచూశాడు, వస్తుందేమోనని. 'ఇంటగెల్చి రచ్చగెలవమ'ని సామెత. ఆమోసు తన భార్య కార్యాలన్ని ఆలోచిస్తున్నాడు. ఇంతచదివీ, నిరర్థకమైనపనులు చేస్తున్నందుకు దిగులుపడుతున్నాడు భార్యవిషయము. 'డబ్బులేనివారు ప్రపంచములో డబ్బుకు కొరగాడ'ను సామెత, అనేకమాట్లు చెప్పాడు భార్యకు. స్వరాజ్యసంపాదనకు ఒక్క మనము సహాయము చేయకపోయినా, వచ్చేదాన్ని యెవడూ అరికట్టలేడని చెప్పాడు భార్యతో. అది అటుండంగా ఏసుక్రీస్తుతో పోల్చుతూవుంటది గాంధీని. చిన్ననాటినుండి పిల్లలకు వుగ్గుపాలులా నేర్పుతూవుంటుంది అని యెన్నోవిధాలా ఆలోచించుకొంటూవుండగావచ్చింది భార్య మాణిక్యము తన పని ముగించుకొని, యేమండీ కాగితముమీద ఒక గీతాపడలేదు యింతవరకూ అంటూ.

మాణీ! విద్యార్థులంతా కోతుల్లా తయారైయ్యారు. నీవు వారిలో ఒక పెద్దకోతిలావున్నావు. ఏమీ మీస్వరాజ్య ఆందోళన అర్థములేని ఆందోళన? అన్నాడు ఆమోసు తనభార్యతో. అలాగుటండీ. అయితే మా సంతోషము. ఆ కోతులే శ్రీరామునికి విజయానికి కారణము, ఆ కాలముల్లో. ఇపుడు వీరే అయియుండాలి వారు నిజముగా పంజేస్తే, యువకులు మతానికి స్థంభాల్లాంటివారు. వారిపై ఆధారపడి వుంది సంఘమని, మన దేవాలయాల్లో వుపన్యాసాలు చేస్తారు చూడండి అది మతానికిగాదు మాతృదేశానికని బదులుచెప్పింది మాణిక్యము భర్తతో.

నీవు స్వరాజ్యవ్యవహారాల్లో జోక్యము కలుగజేసుకోవడము యెంత నష్టమో తెలుసా మనకు అన్నాడు భార్యతో.

ఎంతైనా స్త్రీనే గదటండీ! ఎవ్వరికీ యేమి వుపకారము చేయలేంది స్త్రీయే గదా! ఈ వుద్యమానికి నేనేమి చేయగలను? నాకేమి శక్తివుంది అంది మాణిక్యము.

అందుకనే యీ వెధవపనినుండి విరమించుకో. ఏదో ఈ కాలంలో నాలుగు డబ్బులు సంపాదించుకొనే పనిజూడ్దూ అని చెప్పాడు ఆమోసు.

మా—చూశారుగాదు మీ ఆ మిసెమ్మదగ్గర హైస్కూల్లో పని.

ఆ—నీవు వొప్పుకోవడం లేదుగదా? సంసారభారం నామీదేవుందా? దీనిలో నీకేమీ జోక్యం లేదా?

మా—నా సంసారభారం నాకుబట్టక ఇంకొకరికేలా బడుతుంది? నేను రోజూచేసేది పని గాదూలావుంది, సంపాదించేది డబ్బూగాదూ!

ఏంటే! నీవు వడికేది ఒకపని, నూలు అమ్మేది సంపాదన. ఇలాఅయితే మా గణించి పెట్టావుగదూ. ఐతే నీవుసంపాదించేరూక ఒక సంపాదనంటావు? అన్నాడు భర్త.

మీరు సంపాదించేది దేశ జనాభానిబట్టి సరాసరిచూడండి యేమౌతుందో అని అడిగింది మాణిక్యం.

నేను సంపాదించేది దేశంలో అందరికి యిస్తున్నానా సరాసరిజూడను? ఇల్లాంటి తెలివి తక్కువ ఆలోచనలు చేసివచ్చేది పోగొట్టుకొంటారు నీలాంటి తెలివితక్కువవాళ్ళు అన్నాడు ఆమోసు కష్టంగా.

తెలివితక్కువ—ఆ! వస్తున్నాను తల్లీ అంటూ నిద్రనుండి అమ్మా అని ఏడుస్తూలేచిన తన కూతురు స్వరూపరాణి దగ్గరకువెళ్ళింది మాణిక్యం.

2

ఆమోసు కాలేజీలో ప్రొఫెసరు. ఎం. ఏ. చదివాడు. పాశ్చాత్య దేశసభ్యతలు అలవాటు చేసుకొన్నాడు ఆదేశాలు తిరక్కపోయినా. ఇంట్లో కూడా ఇంగ్లీషు మాట్లాడుతాడు. కళాశాల్లో ప్రింసుపాలుకు ప్రియుడనుకొని నడుస్తూవుంటాడు. ప్రింసుపాలుకేమిగిట్టవో ఇతనుకూగిట్టవు అవి. ఏదోవిధంగా ఆక్టింగ్ లోనైనా ప్రింసుపాలుగా చేయాలని అతని ఉద్దేశం. తన నడవడి, కళాశాలపై అభిమానమూ, ఉత్సాహం, ప్రింసుపాలుపై మమతా చూపితేగాని, సీనియర్లుగావున్నా వాళ్ళనివదిలి ఇతనుకు ప్రింసుపాలు చాన్సుయివ్వడని అతని తలంపు. అతని వంశంవారు అతనివరకు ఒక్క మధ్యరకం జీవితంకూడా గడుపనివారవడం యెరిగి, అదను గ్రహించి, గొప్ప ధనం ఉద్యోగంద్వారా ఆర్జించి పూర్వపు లేమిని పోగొట్టుకోవాలని అతని సంకల్పం. తన ఉద్యోగ కాంక్షలో దప్పితో యితరులను నొప్పించువాడు గాడు. దేవునికి గొప్పభక్తునిలా కనబడేవాడు గుడిలో అతన్ని చూసేవాళ్ళకు.

మాణిక్యంలాంటిది ఆయనభార్య మాణిక్యం. బి. ఏ. చదువుకొంది. అదృష్టమో దురదృష్టమో గాని భర్త ఆలోచనలు ఆమెకు గిట్టలేదు. అంత చదువుకొన్నా, భర్త మాతృదేశాభిమాని గాకపోవడంజూచి, . సిగ్గుపడేది తనలోతాను. సరసోక్తుల్లోనైనా 'నాదేశం' అనిపించాలని ప్రయత్నంచేసేది భర్తతో, లాభంలేదు. ఆమెమాత్రం స్వరాజ్య సంపాదనకు పాటుపడేది తన శక్త్యానుసారం. మంచి దైవభక్తిగల స్త్రీ తన పిల్లలకు స్వదేశసంగీతం నేర్పేది పాశ్చాత్యుల్లాగ. దేశాందోళన ప్రతివిషయంలోను హాజరౌతూవుండేది ఆమె. దేశంముందు, దేవుడు తరువాత అని ఆమె మతం అల్లాబక్సులాగ. దేశానికి దేనినైనా త్యాగంచేయాలని చెప్పేత్యాగి. ఇవి భర్త ఆమోసుకు గిట్టేవిగావు. ఇల్లుచేరినపుడు భర్తను ప్రేమించుట తన మొదటి కర్తవ్యమని ఆమె తలంపు. అంచేత యేవిధమైన లోపంలేకుండా భర్తను, ప్రేమించుచుండేది మాణిక్యం.

3

ఈదినం ఉదయంనుండి యింట్లోలేవు, ఆదివారమనికూడా మనస్సులో లేనట్టుంది. మాకు

మాత్రం 'ఇండిపెండెన్సు' అవసరంలేదనా? పోనీ ప్రార్థనయ్యాక వెళ్ళిపోయావా...అని అనేకమడి గాడు ఆమోసు 'ఇండిపెండెంటుప్లెడ్జి' తీసుకొన డానికి వెళ్ళివచ్చిన భార్యను.

నేనుమాత్రం దేవుడన్నానా గాంధీని! దైవ సమానుడు యెవడు మనకు? నిష్కల్మషంగా, నిష్పక్ష పాతబుద్ధితో, అందరిని, అన్నిటిని ఒకే దృష్టితో చూశేవాడు; ఒకేమనస్సుతో ఆదరించేవాడు దైవ సమానుడంటం తప్పంటారా? అంది మాణిక్యం భర్తతో.

అబ్బే! దేవుడని నేనుచెప్పను...యెవ్వరూ చెప్పలేదుకూడాను యింతవరకు. అయితే ఒకటి మాత్రం చెబుతా. రమణుడు, రామకృష్ణునివలె స్వార్థుడుగాక, తన విశుద్ధజీవితాన్ని తన మేలు కొరకు, కోట్లకొలది తనదేశపు జనులకొరకు త్యాగం చేశాడు. ఇంతకంటే దేవునిత్యాగం యేంగొప్పని చెప్పండి.

ఐతే దేవుంతోచేశావు గాంధీని. నీవు గొప్ప దోవతవు అన్నాడు అతను.

కాదు మరీ! దైవభక్తులందరూ దైవసమానులే! అసలు మనవేదము చెప్పడంలేదూ, దేవుడు మానవుని, తన పోలికగాచేశాడని. 'look up and aim high' నీవు గొప్పవాడవౌనట్లు నీదృష్టి గొప్ప ఆదర్శాలపైనుంచమను సామెత మీకు తెలియదా? నదులు చూడండీ,యెంత కృతజ్ఞతగలవో. తమ జన్మానికి కారణమేమో; మరలా దానిజేరి సంతోషపెట్టా


ఆనందకరమైన దీపావళికి....!
అందమైన వెండి, బంగారు నగలు!!



చక్కని వెండి, బంగారునగలు మావద్ద గ్యారంటీగా దొరకును. వెండి గిన్నెలు, చెంబులు, టీసెట్లు వగైరా సామానులు అమ్మకమునకు సిద్ధముగానున్నవి.

టెలిఫోన్ : 3524 టెలిగ్రాం : "గంధవడి"

గంధవడి శ్రీరాములు శెట్టి & సన్

184 చైనాబజారు రోడు : : జి. టి. మదరాసు

షోరూం :—207, 208 చైనాబజారురోడ్, మదరాసు.

అని, సాగరముల్లోనే కలుస్తూవుంటాయి—ఎప్పుడూ తమదృష్టి సముద్రంవైపుకే తిప్పుతాయి. తమ ప్రవాహప్రగతిలో అవాంతరాలువస్తాయి, జనులు మలినపరుస్తారు; అవే మలినమౌతాయి; కొన్నికొన్ని ఋతువుల్లో ప్రజలు యీ నదులవైపు చూడనైనా చూడరు. వాటిలక్ష్యానికి చేరుతాయి, భక్తుడు దేవునిలో శిలమైనట్లు. తనలో చేరిన తన బిడ్డలనుచూసి వుదధి వుల్లాసము జెందుతుంది, తమజన్మను గ్రహించి, దానిని నిష్కామముగా, తనకొరకూ. యితరుల వుపకారముగానూ, భగవంతునకు ప్రీతిగనూ, నదుల్లా చరిస్తే భూమిపై ఆ వ్యక్తికి యింకా తక్కువయేమిటి?

అబ్బా! మెట్టవేదాంతము మా బోధిస్తున్నావు గదూ! ఇంతకూ నీకు గాంధీ అవసరమా దేశమవసరమా? అన్నాడు భర్త.

మా మంచిమాటడిగారు. నాకు దేశము అవసరము. గాంధీ అంటారా లోకోత్తర పురుషుడని ఆయన్ను ప్రేమిస్తా. అంది మాణిక్యము.

మన ఏసుక్రీస్తుకంటేనా?

మనము కేవలము రాచకీయము మాట్లాడుతూ దేవుడిదగ్గరకెక్కాము. దేవుడి విషయము యెవరి మనస్సు వారిది. ఈ విషయముల్లో ఒకరు చెప్పనవసరములేదు. శిష్యుడూ, భక్తుడూ, దేవునెలా చింతిస్తాడో, అలాగనపడతాడు భగవంతుడాతని మనస్సుకు అంది. 1 అయితే నీకు గాంధీలాగ కనపడ్తాడన్నమాటదేవుడు.' అన్నాడు అలాంటి తీర్మానము నే జెయ్యను—చేయలేను. ఇదివరకు నే చరవీకితో చెప్పినట్లు, నీరుడు దేవునిలా వుండాలని ప్రయత్నిస్తాడు, తన మనస్సు స్వాధీనపర్చుకొని. ఏసుక్రీస్తు పన్నెండుమంది జాలరులను శిష్యులుగా జేసుకొన్నాడు, నాటి తన చిన్న అద్భుతములతో. వారు పండితులుగారు, శాస్త్రులుగారూ; బహుశా: ధనవంతులుగాదేమో. అయితే గాంధీ కుబేర్లాంటివాళ్లను, గొప్పగొప్ప పండితులనూ, వున్నదిలేదు, లేంది వున్నదని నిరూపించు శాస్త్రులను, అద్భుతాలు చేయకనే శిష్యులుగా జేసుకొన్నాడు. పదహారువేలమందికి ప్రియుడుగనూ, తాను జన్మించిన దేశానికి శ్రీకృష్ణునివిషయము, తను బ్రతికివుండగా తెలిసిందిగాని, గాంధీవిషయము ప్రపంచ మారుమూలలు మ్రోగడము నేడు మనము చూస్తున్నాము. 'గవర్నమెంటుకు దాసినిగాకపోతే నేను గాంధీ గోపికల్లో చేరేవారనన్నాడు' మహాకవి అక్బరు. శ్రీరాముడు తనజీవితము కోతులసహాయముతో గడిపాడుగాని, గాంధీయోధానయోధులైన భారతీయులతో గడుపుతున్నాడు. విభీషణుడు రామునకు సహాయముచేసినట్లు, ఆంగ్లేయులు అనేకమంది గాంధీని పొగుడుతూవుంటారు. బుద్ధుడు రాజ్యము త్యజించినట్లు, యీ బుద్ధిమంతుడు సర్వస్వం త్యజించాడు. ఇంతకంటే దేవునికి యేగుణా లెక్కువండీ అంటూవుండగా ఆమోసు సహోద్యోగివచ్చాడు. మాణిక్యము లోపలికివెళ్ళింది.

## 4

మనస్సులో ఒక్క పెద్దకుమారుడు గోవర్ధనరావుమీదవుంది బెంగ మాణిక్యానికి. ఏ నెహ్రూ, జయప్రకాశనారాయణలాంటి వాణ్నిగా చేయాలనుకొంది కుమారుణ్ణి. తనలేమితి పిల్లవాడేమౌనో అన్న ఆలోచనలు కట్టివేశాయి ఆమె పాదాల్ని. ఎదుట వుండి, ప్రయోజనము లేకపోవడముకంటే, భర్త కంటికి మరుగుపెడ్తే మనస్సులోంచి వెంటనే మాపుకొంటాడు గదా అని ఆమె నిశ్చితాభిప్రాయము. దేశములో యెంతోమంది స్త్రీల మానభంగములైనా, పిండోత్పత్తి గావించినపుడే స్వతంత్రభావాల్తో

మానవుని యీ లోకములో వదిలిన పరమేశ్వరుని పనుల కాటంకము కలుగుటకే, అట్టి భగవంతుని చొప్పులకడ్డు తగ్రాదనే యథార్థవాదులను నిస్తారణముగా అష్టకష్టాలు పడువారినిగూర్చి దేవాలయాల్లో ప్రార్థనచేయకపోయినా, ఏసు భగవానునిబిడ్డలుగ లెక్కించుకొని, ఆయనచూపిన శాంతము, ప్రేమ, ఓర్పులకు స్వస్థి చెప్పి, 'నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకు' మను యెహోవావాక్కుకు తిలోదక మిచ్చినవారి విషయము, యివన్నిచూపిన దేవునికి చేయు ప్రార్థనల పాపానికి దూరముగా వుండగలను గదా అన్న సంతోషము మిక్కుటముగావుంది మాణిక్యానికి. సంఘస్థులు ఆమె తలంచు తలంపులకు తాళాలువేయు కాలమువచ్చిందని ఆమె మనస్సు అచ్చెరువు అవుతుంది. పిల్లలవిషయము మతికిరాగానే పండినపండులా రాలిపడుతుంది ఆమె మనస్సు. అయితే తన బీదదేశీయులు చిరిగిపోయిన చీరల్తో, అంగాలన్నీ దాచుకోవడానికి వీలుగాని రవికలు వేసుకొని బజారుల్లో తిరగడము, యీడువచ్చిన బాలికలు తెలిసియూ తనదేశపుస్థితి వెలిబుచ్చుతోన్నామో అన్నట్టు, మొలకొక చిరుగులగుడ్డగట్టి, దానిపై ఒక పేలికను పవిటగావించు దృశ్యము మనస్సుకు రావడముతోనే, మోషే బండలోంచి వచ్చినట్టు వస్తుంది ఆమెకంట నీరు. తిండిపెట్టలేక, తమ కడుపుల బుట్టినందుకు తమనే నిందించుకొంటు, విడిచి పెట్టబడినబిడ్డలు వీధుల్లో, కుక్కలను, రాళ్ళతోనో రప్పలతోనో, బెదరించి, వాటికొరకై బజారుల్లో వేయబడిన పులి విస్తళ్ళను అందుకొని, తమకు భగవంతు డేర్పరిచినదింతేగాబోలు అంటూ తినేవారి పతము హృదయాన పట్టగానే, శివుని జటాజూటము నుంచి గంగ ప్రవహించిన వేగముతో ప్రవహిస్తుంది ఆమె అశ్రుధారా ప్రవాహము. తమ సౌకర్యాలు వదిలి, మాటమాత్రముతో లభించు లక్ష్మిని కాలు దన్ని, యేబాధ, యే కష్టాలు జీవితముల్లో చూడ్డానికి అవకాశములేని, అవకాశాలువదలి, ప్రపంచపు మూలమూలలనుండి కావలసినవి, కాలహరణము లేకనే అర్జునుడు గంగను దెచ్చినట్టు, తెప్పించగల సమర్థతగలిగి, రాజయోగాలకు విడాకులిచ్చి, తన్నులు తిని, తిట్టులుబడి, మానభంగాలొంది, యీ దరిద్ర నారాయణు నుద్ధరించి దేశాన్ని సంతోషపెట్టాలనే వాళ్ళవిషయము కలలోనైనాతల్చని మతగురువుల, మతస్థులసంగతి వదులుకొని, వారికానందము కలిగించాలనుకొంది మాణిక్యము. స్వదేశీయుల త్యాగాన్ని గ్రహించకపోయినా, విదేశీయుల అలవాట్లనలవర్చుకొని, వారిపై యీగనుసైతము వాలనీయనంతటి భక్తికలిగినందుకు, తన క్రైస్తవులను, వారి గురువులను అభినందిస్తుంది. నెమళ్ళలోచేరి పరాభవము చెందిన వాయసములాగాక, తన జాతిలోనేవుండి సంబరపడ్డాకాకిలా వుండాలని మాణిక్యము. ఊహ. ఏసుక్రీస్తు తనకు సహాయముగా వుండి మంచి మార్గాల్లో నడిపిస్తాడని ఆమె నమ్మకము. తనమనస్సు



భర్తకెరిగించాలనుకొంది. ఇంతలో భర్తవచ్చాడు. ఆయనకు పరిచర్యచేయ వెళ్ళింది లోపలకు మాణిక్యము—

## 5

ఇంత కాలంగడిచినా భర్తలో మార్పేమీ లేదుసరిగదా, యితరులు విమర్శింప మొదలుపెట్టారు మాణిక్యాన్ని క్రైస్తవురాలిగావుండి స్వదేశ వ్యామోహం పడ్డందుకు. మనపాలకులు విశుద్ధ క్రైస్తవులు, వారిపాలనలో మన మెంతహాయిగానున్నామోచూడు అని చెప్పే క్రైస్తవ లెక్కువయ్యారు యిప్పుడు. మానవుడు చేయవల్సినకార్యాలనేకాలున్నాయి. అయితే భగవంతుడనుగ్రహించినసమయమతిస్వల్పమనీ, అదికూడా వేగంగా వెళ్ళుతోందన్న ఆలోచన మాణిక్యం మనస్సు ఆక్రమించుకొంది. బీదరికంచేత భారతదేశ ప్రజలఆయుఃప్రమాణం మనస్సుకొచ్చింది. కాలాతీతం కష్టమనిపించిందామెకు.

## 6

ఎంత వెతకినా ప్రయోజనం గనపళ్ళేదు ఆమోసుకు. అత్తగారిఇంటికి 'తంతి' పంపాడు. వారు ఖంగారుపడుతూవచ్చారు. పిల్లలందరు ఇంట్లోనే వున్నారు. ఇప్పుడు గ్రహించాడు మాణిక్యాన్ని చేతులార జారవిడ్చాడని. పోర్టబులు చర్ఖాలేదు ఇంట్లో. ఆత్మహత్యగాదని ధృఢపడ్డారు అందరు. స్వదేశీ స్వాతంత్ర్యసంపాదనకు, భార్యకు తోడుగా ఉండనందుకు సిగ్గుపడుటకుబదులు, ఆమెను నిందించినందుకు యిపుడు సిగ్గుపడుతున్నాడు ప్రపంచాన్నిచూచి. మాణిక్యంభర్త ఇశ్రయేలీయులకు స్వతంత్ర మిప్పించుట, వారిస్వదేశం వారినిచేర్చుటకు, దాస్యంనుండి వారిని విడిపించుటకు యెహోవా దేవుడుచేసినవన్నియు ఆతని మనస్సులోకి వచ్చాయి. పాడుబడ్డ దేవాలయాల్లో పవిత్రమైన గువ్వలు, పావురాలు వచ్చిచేరినట్టు ఇశ్రయేలీయుల స్వతంత్రత కొరకు దేవుడు యెర్రసముద్రంల్లో చంపినవారిని, ప్రతియింటా తొలిచూలు మగబిడ్డ దైవాజ్ఞచే చచ్చిపోవుట మనస్సుకొచ్చాయి. మనస్సుమారింది. తన భార్య విశాలహృదయం ఇప్పుడవగాహనైంది. తాత్కాలిక తనసంపాదన నిరోధించి భావికాలపు తనసంతానం, యావద్భారతసంతానం సుఖపడేటట్టు, దేశకల్యాణానికి సంసిద్ధుడయ్యాడు.

* * *

ఇల్లువిడిచి వార్ధాచేరిన భార్య దగ్గరనుండి జాబువచ్చింది ఆరోదినం. భర్తను ఏవిషయంల్లోనైనా విడిచిపెట్టుట తప్పనితెలిసీ, తన స్వదేశపాటుకై అంతరాయాలు లేకుండా చేసుకోవడానికి, గత్యంతరంలేక, భర్తకు విడాకులిచ్చుట చింతిస్తున్నానని రాసింది. తనవంటి మందభాగ్యురాలినిగాక విశాల హృదయముగల స్త్రీ రత్నాన్ని వివాహమాడి తమ గౌరము నిలుపుతామని రాసింది. ఉత్తరము చూడ్డముతోనే ఖిన్నమైపోయాడు ఆమోసు. రెండోదినమే తన ఉద్యోగానికి స్వస్తిచెప్పి 'గ్రాండ్ ట్రంక్ యెక్స్ప్రెస్' యెక్కాడు తన మాణిక్యాన్నిచేరి ఆ కాంతి కెంజాయల్లో ప్రజ్వలింపాలని. అంతా ఆశ్చర్యపోయారు యీ మార్పుకు.